SRI GAYATRI AYURVEDIC MULTI SPECIALITY CENTRE
GIAYS
శ్రీ గాయత్రి ఆయుర్వేదిక్ మల్టీస్పెషాలిటీ సెంటర్

D.No. 58-15-124, Santhinagar, NAD 'x' Road, Visakhapatnam-530016. Ph : 9247011553
Email: srigayatriayurvedavskp@gmail.com

APTEL RNI NO: 62061/2015

# వార్తావళి


తెలుగు దినపత్రిక


వివాహ మరియు గృహ సంబంధమైన
శుభ ముహూర్తములు మరియు
పుట్టిన తేది, సమయం, పుట్టిన ప్రాంతం
నక్షత్రములు బట్టి జాతకములు వ్రాయబడును
బులుసు వెంకట సుబ్రహ్మణ్యం
M.A. Astrology
#135/B,Sector-3, Ukkunagaram, Vizag-32
e*mail : bulusu333@gmail.com
Ph : 70320 34001, 85001 59006

విశాఖపట్నం : శుక్రవారం 4 సెప్టెంబర్ 2020 | ఎడిటర్ : బులుసు వెంకట సుబ్రహ్మణ్యం | VAARTAVALI TELUGU DAILY | పేజీలు : 8 | రూ. 1.00 | సంపుటి 5 | సంచిక 198



# రైతులకు అందే రుణం ఉచితమే: జగన్



**అమరావతి, వార్తావళి, సెప్టెంబర్ 3 :** రైతుకు అందే విద్యుత్తు ఎప్పటికీ ఉచితమేనని, ఒక్క కనెక్షన్ కూడా తొలగించబోమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణల వల్ల రైతుపై ఒక్కపైసా భారం కూడా పడదని హామీ ఇచ్చారు. అమల్లో ఉన్న పథకాన్ని మరింత మెరుగుపరుస్తున్నామని, వచ్చే 30-35ఏళ్ల పాటు ఉచిత విద్యుత్ పథకానికి ఢోకా లేకుండా చేస్తున్నట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ కేబినేట్ గురువారం సమావేశమైంది. సీఎం జగన్ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో ఉచిత విద్యుత్ పథకం- నగదు బదిలీకి రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. అన్ని వ్యవసాయ కనెక్షన్లను రెగ్యులరైజ్ చేస్తున్నట్లు తెలిపారు. "కనెక్షన్ ఉన్న రైతు పేరు మీద బ్యాంకు ఖాతా ఉంటుంది. కరెంటు బిల్లు డబ్బు అందులో నేరుగా జమ కానుంది. అదే డబ్బును రైతులు డిస్కంలకు చెల్లించనున్నారు.
దీని వల్ల రైతుపై ఎలాంటి భారం ఉండదు" అని స్పష్టం చేశారు. "చంద్రబాబు ఉచిత విద్యుత్తు సాధ్యం కాదన్నారు. కరెంటు తీగలపై బట్టలు ఆరేసుకోవడమేనని ఎద్దేవా చేశారు. బషీర్‌బాగ్‌లో రైతులపై కాల్పులు జరిపించిన చరిత్ర చంద్రబాబుది. సుమారు 8వేల కోట్ల మేర ఉచిత విద్యుత్తు బకాయిలు పెట్టారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ బకాయిలు తీర్చాం. రూ. 1700 కోట్లతో ఫీడర్లను అప్‌గ్రేడ్ చేశాం. నాణ్యమైన కరెంటు ఇస్తున్నాం. పగటిపూట 9 గంటల కరెంటు, ఇప్పటికే 89శాతం ఫీడర్లలో అమలు అవుతోంది. రబీ సీజన్ నుంచి పూర్తి స్థాయిలో అమల్లోకి వస్తుంది. 10వేల మెగా వాట్ల సోలార్‌తో పథకాన్ని మరింత గొప్పగా దీర్చిదిద్దుతాం. ఉచిత విద్యుత్ పథకానికి ఢోకా లేకుండా ప్రణాళికలు రచిస్తున్నాం. ఉచిత విద్యుత్‌పై పేటెంట్ ఒక్క వైఎస్సార్‌కే ఉంది.
అందుకే పథకానికి ఆయన 'పేరు" అని సీఎం జగన్ తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ఉచిత విద్యుత్ పథకం అమలు కానున్నట్లు వెల్లడించారు. అదే విధంగా ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు రంగం సిద్ధమైనట్లు పేర్కొన్నారు.
ఇక కేంద్ర ప్రభుత్వం తెస్తున్న సంస్కరణలకు అనుగుణంగానే వ్యవసాయ విద్యుత్తు వినియోగదారులకు నగదు బదిలీ పథకాన్ని చేపట్టాల్సి వచ్చిందని ముఖ్య మంత్రి ముఖ్య సలహాదారు అజేయ కల్లం స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

# సుప్రీం కోర్టులో ఏపీకి చుక్కెదురు




**ఢిల్లీ:** ఏపీ సర్కార్‌కు సుప్రీం కోర్టులో మరోసారి చుక్కెదురైంది. ఆంగ్లమాధ్యమం విషయంలో హైకోర్టు ఆదేశాలపై స్టే కోరుతూ ఏపీ ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ప్రభుత్వ అభ్యర్థనను తిరస్కరించింది.
ఆంగ్ల మాధ్యమాన్ని తప్పనిసరి చేస్తూ ఏపీ ప్రభుత్వం 81, 85 జీవోలు తీసుకొొచ్చిన విషయం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది కేవీ విశ్వనాథన్ వాదనలు వినిపించారు. ఒకటో తరగతి నుంచి ఆరో తరగతి వరకు ఆంగ్లమాధ్యమాన్ని తప్పనిసరి చేస్తూ ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోలను రద్దు చేయడం సరికాదని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. మాతృభాషలోనే విద్యాబోధన జరగాలని విద్యాహక్కు చట్టంలో లేదని ఆయన కోర్టుకు తెలియజేశారు. ప్రభుత్వ ప్రగతిశీల నిర్ణయం తీసుకుందని వాదించారు. తెలుగులో బోధన వల్ల పాఠశాలల్లో నమోదు తగ్గిపోతోందని కోర్టుకు వివరించారు. దీనిపై స్పందించిన జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం పిటిషన్‌పై స్పందించేందుకు ప్రతివాదులకు నోటీసులు ఇస్తామని చెప్పింది. నోటీసులతో స్టేకూడా ఇవ్వాలని విశ్వనాథన్ ధర్మాసనాన్ని కోరారు. ప్రతివాదుల తరఫున సీనియర్ న్యాయవాది శంకర్ నారాయణన్ వాదనలు వినిపించారు. ప్రభుత్వ నిర్ణయంతో తెలుగు మాధ్యమం ఎంపిక అవకాశాన్ని కాలరాస్తోందన్నారు. తెలుగు మాధ్యమ పాఠశాలలను కనుమరుగు చేసే యత్నం జరుగుతోందని కోర్టుకు తెలిపారు. ప్రతివాదులు అఫిడవిట్ దాఖలు చేసిన తర్వాత స్టేపై పరిశీలిస్తామని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. కేవియట్ వేసిన విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రొఫెసర్లు రెండు వారాల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీం ఆదేశించింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 25కి వాయిదా వేసింది.

# ప్రధాని మోదీ వ్యక్తిగత ట్విటర్ ఖాతా హ్యాక్!



ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ వ్యక్తిగత ట్విటర్ ఖాతా హ్యాకింగ్‌కు గురైంది. ఈ విషయాన్ని ట్విటర్ ఈరోజు ఉదయం నిర్ధారించింది. ప్రధాని ట్విటర్ ఖాతాను తిరిగి పునరుద్ధరించామని.. ఈ ఘటనపై విచారణ జరుపుతున్నట్టు ఆ సంస్థ వెల్లడించింది. మోదీ ఖాతాను తమ స్వాధీనంలోకి తీసుకున్న హ్యాకర్లు, ప్రధాని జాతీయ సహాయ నిధికి క్రిప్టో కరెన్సీ ద్వారా విరాళాలివ్వాల్సిందిగా అభ్యర్థించారు. "కొవిడ్-19 కట్టడికి పీఎం నేషనల్ రిలీఫ్ ఫండ్‌కు ఉదారంగా విరాళాలివ్వాల్సిందిగా మీ అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. భారత్‌లో మళ్లీ క్రిప్టోకరెన్సీ చలామణిలోకి వచ్చింది గనక మీ విరాళాలను దయచేసిఅంటూ హ్యాకర్లు ట్వీట్ చేశారు. దీనిపై స్పందించిన ట్విటర్ "ఈ దుశ్చర్యపై మాకు సమాచారం అందింది. ఈ ఖాతాను తిరిగి సురక్షితం చేసేందుకు చర్యలు తీసుకున్నాం. కాగా ఇందుకు దారితీసిన పరిస్థితిని గురించి సత్వర విచారణ చేపట్టాం' అని తెలిపింది. మే 2011న ప్రారంభించిన ఈ ఖాతాను సుమారు 25 లక్షల మందికి పైగా అనుసరిస్తుండగా.. ఇప్పటి వరకు దీనిద్వారా 37,000 ట్వీట్లు వెలువడ్డాయి. మోదీ సాధారణంగా ఈ ఖాతా నుంచి తన కార్యక్రమాలు, ప్రసంగాలకు సంబంధించిన వివరాలను తరచుగా షేర్ చేస్తుంటారు. కాగా, దీన్నుంచి "మన్ కీ బాత్"ను గురించి ఆగస్టు 31న ట్వీట్ వెలువడింది. ఇదిలా ఉండగా జులైలో కూడా వారన్ బఫెట్, జెఫ్ బెజోస్, బరాక్ ఒబామా, జో బైడెన్, బిల్ గేట్స్ వంటి పలువురు ప్రముఖుల ట్విటర్ ఖాతాలు హ్యాకింగ్‌కు గురికావడం కలకలం రేపిన విషయం తెలిసిందే..

# 'కాగజ్'... స్వదేశీ స్కానింగ్ యాప్




**ఢిల్లీ:** చైనాతో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ఆ దేశానికి చెందిన పలు రకాల యాప్‌లపై భారత్‌లో నిషేధం విధించారు. వాటిలో రోజువారీ ఉపయోగించేవి కూడా ఎన్నో ఉన్నాయి. దీంతో తరచుగా వాడే యాప్స్ అందుబాటులో లేకపోవడంతో నెటిజన్లు ప్రత్యామ్నాయల వైపు చూస్తున్నారు. అలానే డెవలపర్స్ కూడా వాటి బదులుగా కొత్త యాప్స్‌ను రూపొందిస్తున్నారు. తాజాగా డాక్యుమెంట్ స్కానింగ్ యాప్‌లకు ప్రత్యామ్నాయంగా ఓ యాప్ అందుబాటులో తీసుకొచ్చారు. కాగజ్ స్కానర్ పేరుతో రూపుదిద్దుకున్న ఈ యాప్‌ను స్నేహాన్ష గాంధీ, గౌరవ్ శ్రీశ్రీమల్, తమన్‌జీత్ సింగ్ బింద్రా అనే ఐఐటీ పూర్వ విద్యార్థుల బృందం రూపొందించింది. ఇందులో మొత్తం నాలుగు స్కానింగ్ మోడ్‌లు ఉన్నాయి - బ్లాక్, వైట్, కలర్ స్కాన్, గ్రేస్కేల్, ఒరిజనల్. మనం స్కాన్ చేయాలనుకున్న డాక్యుమెంట్ అంచులను ఆటోమేటిగ్గా స్కాన్ చేసి అడ్జస్ట్ చేస్తుంది. స్కాన్ చేసిన డాక్యుమెంట్‌ని పీడీఎఫ్ ఫార్మాట్‌లో మెయిల్, సోషల్ మీడియా, టెక్ట్స్ ద్వారా షేర్ చేసుకోవచ్చు. ఒకేసారి చాలా డాక్యుమెంట్లను స్కాన్ చేసుకోవచ్చు. డేటా సెక్యూరిటీ కోసం యాప్ లాక్ ఫీచర్ కూడా ఉంది. యాప్‌ను ఉపయోగించేందుకు ఎలాంటి రిజిస్ట్రేషన్ అవసరం లేదు. పూర్తిగా ఉచితం. ఇందులో ఎలాంటి యాడ్స్ ఉండవు. హిందీ భాషలో కూడా ఈ యాప్ అందుబాటులో ఉంది. డ్రైవింగ్ లైసెన్స్ నుంచి ముఖ్యమైన ఎన్నో రకాల ఫైల్స్‌ని ఇందులో స్టోర్ చేసుకోవచ్చు.

# అధునాతన పారిశుధ్య యంత్రాల ప్రారంభం



**విజయవాడ, వార్తావళి, సెప్టెంబర్ 3 :** అధునాతన పారిశుధ్య యంత్రాలను మంత్రి బొత్స సత్యనారాయణతో కలిసి విజయవాడ మున్సిపల్ కమిషనర్ ప్రసన్న వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విఎంసీ తరుపున కొత్త టెక్నాలజీతో ఏడు కొత్త వాహనాలను కొనుగోలు చేశామని ప్రసన్న వెంకటేష్ తెలిపారు. వీటి ద్వారా కాలువల పూడికలను సులువుగా తీయొచ్చని పేర్కొన్నారు. జెసిబీలో మూడు మినీ వాహనాలు, కొత్తగా మూడు నాళామేన్ వాహనాలను కొనుగోలు చేసినట్లు చెప్పారు. మూడు క్లీనింగ్ యంత్రాలను సైతం అందుబాటులోకి తెస్తున్నామని వివరించారు. ఈ కొత్త యంత్రాల వల్ల పని వేగవంతమవుతుందని, సమయం కూడా ఆదా అవుతుందన్నారు.

**పాఠకులకు విజ్ఞప్తి**

www.vaartavali.com వెబ్‌సైట్‌లో వార్తావళి దినపత్రిక ఇంటర్నెట్ పేపర్ వస్తుందని చెప్పడానికి వార్తావళి దినపత్రిక యాజమాన్యం తెలియపరుస్తున్నది. ఈ అవకాశాన్ని పాఠకులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవల్సిందిగా కోరుతున్నాము.

# మూడు మద్యం బాటిళ్లు నేరం కాదు

**అమరావతి, వార్తావళి, సెప్టెంబర్ 3 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెలుపల లేదా లోపల కొనుగోలు చేసిన మూడు మద్యం బాటిళు ఓ వ్యక్తి కలిగి ఉండటం... ఇతర రాష్ట్రాల్లో కొనుగోలు చేసిన మూడు బాటిళ్లను రాష్ట్రంలోకి తీసుకురావడం నేరం కాదని హైకోర్టు తీర్పు ఇచ్చింది. ప్రభుత్వం గతంలో జారీ చేసిన జీవో 411 ప్రకారం స్వదేశీ తయారీ విదేశీ మద్యం (ఐఎంఎఫ్ఎల్) మూడు బాటిళ్లు, విదేశీ మద్యం మూడు బాటిళ్లు, 650 ఎం.ఎల్ 6 బీరు సీసాలు, 2 లీటర్ల కల్లు అనుమతి లేకుండా ఓ వ్యక్తి కలిగి ఉండేందుకు అవకాశం ఉందని గుర్తు చేసింది. పొరుగు రాష్ట్రం నుంచి ఏపీలోకి మద్యం తీసుకొస్తున్నారని పేర్కొంటూ ప్రభుత్వం కేసులు నమోదు చేయడం చట్ట విరుద్ధం అని తేల్చి చెప్పింది. రంపచోడవరం పోలీసులు... కె. శ్రీనివాసులు మరో నలుగురిపై నమోదు చేసిన కేసును రద్దు చేసింది. వారి వాహనాన్ని తక్షణం విడిచిపెట్టాలని ఆదేశించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు బుధవారం ఈ మేరకు తీర్పు ఇచ్చారు. మద్యం రవాణా చేస్తున్నారనే కారణంతో రంపచోడవరం, జగ్గయ్యపేట పోలీసులు ఏపీ ఎక్సైజ్ సవరణ చట్టం-2020లోని సెక్షన్ 34(ఏ) ప్రకారం కేసులు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకోవడాన్ని సవాలు చేస్తూ శ్రీనివాసులు, మధుసూదన్‌రెడ్డి రెండు వ్యాజ్యాలు దాఖలు చేశారు. పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. జీవో 411 ప్రకారం ఎలాంటి అనుమతి, లైసెన్స్ లేకుండా ఓ వ్యక్తి గరిష్ఠంగా మూడు మద్యం బాటిళ్లు కలిగి ఉండొచ్చని వివరించారు. దీనిపై ఎక్సైజ్ జీపీ మాట్లాడుతూ... 'ఏపీ లోపల కొనుగోలు చేసిన మూడు మద్యం బాటిళ్లను మాత్రమే ఓ వ్యక్తి కలిగి ఉండటానికి వీలుంది. రాష్ట్రం వెలుపల కొనుగోలు చేసిన మద్యాన్ని 'దిగుమతి' చేసినదిగా భావించాలి. వాటిని తీసుకురావడానికి చట్ట ప్రకారం అనుమతి ఉండాలి' అని చెప్పారు. ఈ వాదనలను తోసిపుచ్చిన న్యాయమూర్తి.. ఎలాంటి అనుమతి లేకుండా మూడు బాటిళ్లు ఓ వ్యక్తి ఎప్పుడైనా కలిగి ఉండటానికి ఒకసారి ప్రభుత్వం అనుమతి ఇచ్చాక.. రాష్ట్రం వెలుపల కొనుగోలు చేసిన మద్యానికి అనుమతి అవసరమని చెప్పడానికి వీల్లేదు. ఏపీలో తయారైన మద్యానికి, వెలుపల తయారైన మద్యానికి మధ్య వ్యత్యాసాన్ని తెలపలేదు' అని పేర్కొన్నారు.




# మరో 100 రైళ్లను నడపనున్న భారత రైల్వే

**న్యూఢిల్లీ:** దేశ వ్యాప్తంగా అన్‌లాక్ 4.0 సడలింపుల నేపథ్యంలో సాధారణ ప్రయాణికుల కోసం రైళ్లు నడిపేందుకు భారత రైల్వే కసరత్తులు ప్రారంభించింది. అధిక డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో ఇప్పుడున్న వాటికి అదనంగా 100 ప్రత్యేక రైళ్లు నడపనుంది. ఇందుకోసం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను సంప్రదిస్తున్నట్లు రైల్వే శాఖ ప్రతినిధి ఒకరు తెలిపారు. రైలు ప్రయాణం ఇకపై మరింత సురక్షితంగా, సుఖవంతంగా.. 20 కొత్త సౌకర్యాలు! త్వరలోనే దీనికి సంబంధించిన ప్రకటన విడుదల చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదనలను రైల్వే శాఖ హెూంశాఖకు పంపింది. హెూంశాఖ నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన వెంటనే ఈ రైళ్లు ప్రారంభం కానున్నాయి. రాష్ట్రాలతో సమన్వయం చేసుకుంటూ ప్యాసింజర్ రైలు సర్వీసులు ప్రారంభించనున్నట్లు రైల్వే వర్గాలు వెల్లడించాయి. దేశంలోని అన్ని ప్రాంతాలను అనుసంధానం చేస్తూ.. ఎక్కువగా ప్రయాణికులు ఉండే మార్గాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపాయి.

త్వరలో 'వార్తావళి' తెలుగు దినపత్రిక యూ ట్యూబ్ చానల్ ప్రారంభమవుతుంది.
ఎపిలో వివిధ జిల్లాల్లో, నియోజకవర్గాల వారీగా విలేకరులు కావెలెను.
యూ ట్యూబ్ చానల్‌లో పనిచేయుటకు ఆసక్తి గల అభ్యర్థులు కావలెను.
bulusu555@gmail.com
మెయిల్‌కి తమ బయోడాటా పంపించగలరు.
YouTube

**విలేకరులు కావలెను**

'వార్తావళి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు పశ్చిమగోదావరి, అనంతపురం, విశాఖ పశ్చిమం, తూర్పు, పాడేరు, అరకు ప్రాంతాల్లో నియోజకవర్గాల వారీగా జిల్లా ఇన్‌చార్జ్‌లుగా కమీషన్ పద్ధతిలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను. ఆసక్తి గల వారు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
7032034001, 8500159006

# సంపాదకీయం

## ధర్మాసనం సంచలనం వ్యాఖ్యలు

గత కొన్ని రోజులుగా ప్రశాంత్ భూషణ్ చుట్టూ తిరిగిన కోర్టు ధిక్కార వివాదం సోమవారం సుప్రీంకోర్టు ఆయనకు రూపాయి జరిమానా విధించడంతో ముగిసింది. ఆయన పెట్టిన రెండు ట్వీట్లు న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేలా వున్నాయని, ఆయన నేరం చేసినట్టు నిర్ధారణ అయిందని సర్వోన్నత న్యాయస్థానం గత నెల 13న తేల్చింది. క్షమాపణ చెబితే సరేసరి...లేనట్టయితే శిక్ష తప్పదని చెబుతూ తుది తీర్పును వాయిదా వేసింది. వేయదగ్గ శిక్షపై ఆ నెల 20నుంచి వాదప్రతివాదాలు నడిచాయి. చివరకు విధించిన శిక్ష రూపాయి జరిమానా లేదా మూడు నెలల జైలు, మూడేళ్లపాటు న్యాయవాద వృత్తినుంచి సస్పెన్షన్. జరిమానా చెల్లించడానికే ప్రశాంత్ భూషణ్ మొగ్గుచూపారు. కేవలం ఈ శిక్షను సమీక్షించమని కోరడానికి తనకున్న హక్కును వినియోగించుకోవడం కోసమే జరిమానా చెల్లిస్తున్నట్టు ఆయన వివరించారు. సుప్రీంకోర్టు సుమోటాగా ఈ కేసు తీసుకుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఏ బాబ్డే హార్లీ డేవిడ్‌సన్ మోటార్ సైకిల్‌పై వున్న ఫొటోపై ప్రశాంత్ చేసిన వ్యాఖ్య, గత ఆరేళ్లుగా సుప్రీంకోర్టు తీరుతెన్నులపై చేసిన వ్యాఖ్య ఈ వివాదానికి మూలం. సుప్రీంకోర్టును లేదా న్యాయవ్యవస్థ మొత్తాన్ని అప్రతిష్టపాలు చేసే ఉద్దేశం తనకు లేదని ప్రశాంత్ వాదిస్తే...తగినవిధంగా స్పందించకపోతే దేశవ్యాప్తంగా న్యాయవాదులకూ, కక్షిదారులకూ తప్పుడు సంకేతం వెళ్తుందని ధర్మాసనానికి నేతృత్వంవహించిన జస్టిస్ అరుణ్ మిశ్రా అభిప్రాయపడ్డారు. చూడటానికి ఇది రూపాయితో సరిపెట్టిన దండనగా కనబడవచ్చు. కానీ న్యాయవ్యవస్థపై విమర్శలు సహించబోమన్న సంకేతాలు పంపింది. దేశంలోని కార్యనిర్వాహక, శాసన వ్యవస్థలతో పోలిస్తే న్యాయవ్యవస్థపై సాధారణ ప్రజానీకంలో ఇప్పటికీ గౌరవప్రపత్తులున్నాయి. అడపా దడపా అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తమైన సందర్భాలు లేకపోలేదు. కానీ మొత్తంగా మిగిలిన రెండింటితో పోలిస్తే అది మెరుగన్న అభిప్రాయమే బలంగా వుంది. అందులో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పిన న్యాయమూర్తులే ఇందుకు కారణం. నిజానికి బయటవారితో పోలిస్తే వారే అవినీతిని బాహాటంగా ఎత్తిచూపారు. ఇందుకు జస్టిస్ కృష్ణయ్యర్ మొదలుకొని జస్టిస్ కట్జూ వరకూ ఎందరినో ఉదాహరించవచ్చు. న్యాయమూర్తులుగా పనిచేస్తున్నప్పుడూ, రిటైరయ్యాక కూడా వారు ఈ పని చేశారు. న్యాయపీఠంపై వున్నవారిలో కనీసం 20 శాతంమంది అవినీతిపరులని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ వెంకటాచలయ్య చెప్పిన మాటను ఎవరూ మరిచిపోరు. న్యాయమూర్తుల్లో రెండు రకాలవారున్నారని...న్యాయం తెలిసినవారు, కేంద్ర న్యాయమంత్రి తెలిసినవారు అని విపక్షంలో వున్నప్పుడు బీజేపీ నేత స్వర్గీయ అరుణ్ జైట్లీ చమత్కరించారు. 'మేం అధికారంలోకొచ్చాక ఆ ధోరణి పూర్తిగా పోయింద'ని ఆ తర్వాత ఆయన ఎక్కడా చెప్పిన దాఖలా లేదు. అలహాబాద్ హైకోర్టుపై పదేళ్ల క్రితం సుప్రీంకోర్టు ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు పెను సంచలనానికి దారితీశాయి. ఆ వ్యాఖ్యలవల్ల నిజాయితీపరులైన న్యాయమూర్తులపై సైతం నీలినీడలు కమ్ముకున్నాయని, వాటిని వెనక్కి తీసుకోవాలని హైకోర్టు తరఫున పిటిషన్ దాఖలైనప్పుడు 'ఇది స్పందించాల్సిన సమయం కాదు...ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన సమయం' అంటూ ధర్మాసనం దాన్ని తోసిపుచ్చింది. న్యాయవ్యవస్థ అవినీతిపై ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ మూడేళ్లక్రితం నివేదిక విడుదల చేసినప్పుడు సైతం నాటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ కేహార్ నేతృత్వంలోని ధర్మాసనం అది కోర్టు ధిక్కారం కిందకు రాదని తేల్చిచెప్పింది. 1995లో అప్పటి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. రామస్వామి ఈ విషయంలో ఇంకాస్త ముందుకెళ్లారు. సదుద్దేశంతో, సంయమనంతో న్యాయమూర్తి ప్రవర్తనను లేదా న్యాయస్థానం ప్రవర్తనను కఠిన పదజాలంతో విమర్శించినా కోర్టు ధిక్కారంకాదన్నారు. అయితే అవి న్యాయమూర్తి వ్యక్తిత్వహననానికి, నిష్పాక్షికతను ప్రశ్నార్థకం చేసే స్థాయికి దిగజారకూడదన్నది జస్టిస్ రామస్వామి గీసిన లక్ష్మణరేఖ. ఇతర వ్యవస్థలకూ, న్యాయవ్యవస్థకూ మధ్య మౌలికంగా వ్యత్యాసం వుంది. మిగతా రెండు వ్యవస్థల్లో పనిచేసేవారు ఇతర వ్యవస్థలపై లేదా తమ వ్యవస్థలపై విమర్శలు చేయలేరు. నిబంధనలు ఒప్పుకోవు. ఒక్క న్యాయవ్యవస్థ మాత్రమే ఎవరిలోపాలనైనా నిశితంగా విమర్శించగలదు. అటువంటి అధికారమూ, హక్కూ వున్న వ్యవస్థ మరీ ఇంత సున్నితంగా వుండటం సబబు కాదు.

# చరిత్రలో సెప్టెంబర్

## నోబుల్ బహుమతి గ్రహీత ఆల్బర్ట్ స్విట్జర్ వర్ధంతి

**1825 : భారత స్వాతంత్ర్య సమరయోధుడు దాదాభాయి నౌరోజీ జననం. (మ. 1917)(చిత్రంలో)**

**1906 : మాలిక్యులర్ బయాలజీ కి మార్గదర్శకుడు మాక్స్ డెల్‌బ్రక్ జననం (మ. 1981).**

**1935 : ప్రసిద్ధిచెందిన తెలుగు రచయిత కొమ్మూరి వేణుగోపాలరావు జననం (మ. 2004).**

**1962 : భారత క్రికెట్ జట్టుకు వికెట్ కీపర్ గా పనిచేసిన కిరణ్ మోరే జననం.**

**1965 : ఉత్తమ సేవాదృక్పథం కలిగిన వైద్య నిపుణుడు, నోబెల్ బహుమతి గ్రహీత ఆల్బర్ట్ స్విట్జర్ మరణం (జ. 1875).**


**1971 : దక్షిణాఫ్రికా క్రికెట్ క్రీడాకారుడు లాన్స్ క్లూసెనర్ జననం.**

**1999 : పోలీస్ ఉన్నతోద్యోగి, "కడప పులి" గా పేరుగాంచిన చదలవాడ ఉమేశ్ చంద్ర మరణం (జ. 1966).**

**2007 : తెలుగు సినిమా నటి వై.రుక్మిణి మరణం.**

**2007 : ప్రముఖ నాటక, సినీ కథా రచయిత, జ్యోతిష శాస్త్ర పండితుడు భమిడిపాటి రాధాకృష్ణ మరణం (జ. 1929)**

ఆల్బర్ట్ స్విట్జర్ (జ: జనవరి 14, 1875 - మ: సెప్టెంబరు 4, 1965) ఉత్తమ సేవాదృక్పధం కలిగిన వైద్య నిపుణుడు, నోబెల్ బహుమతి గ్రహీత, లాంబరీని లోని ఆల్బర్ట్ స్విట్జర్ హాస్పిటల్ వ్యవస్థాపకుడు. ఇతడు 1952 సంవత్సరపు నోబెల్ శాంతి బహుమతిని 1953 సంవత్సరంలో అందుకున్నాడు. ఇతడు లాంబరీనిలో (ప్రస్తుతం గాబన్ దేశంలో) ఆల్బర్ట్ స్విట్చర్ హాస్పిటల్ ను స్థాపించి అభివృద్ధి చేసి, పశ్చిమ ఆఫ్రికా ప్రజలకు మరువలేని సేవచేశాడు. 1912 సంవత్సరంలో స్విట్జర్ తన స్వంత ఖర్చులతో ఆఫ్రికాలోని లాంబరీనిలో నున్న పారిస్ మిషనరీ సొసైటీలో వైద్యునిగా పనిచేయడానికి నిర్ణయించుకొన్నాడు. అప్పుడు అదొక ఫ్రెంచి కాలనీ. సంగీత కార్యక్రమాలు నిర్వహించి నిధులు పోగుచేశాడు. అందుకు ప్రముఖ సంగీతకారుడు బాచ్ కూడా చాలా సహాయం చేశాడు. 1913 సంవత్సరంలో భార్యతో సహా సుమారు 200 మైళ్ళ దూరం చిన్న తెప్పలో ప్రయాణించి హాస్పిటల్ నెలకొల్పడానికి ప్రయాణమయ్యాడు. మొదటి తొమ్మిది నెలలు భార్యాభర్తలు సుమారు 2,000 మంది వ్యాధిగ్రస్తుల్ని పరీక్షించారు. కొంతమంది సుదూర ప్రాంతాల నుండి వచ్చినవారున్నారు. గాయాలనే కాకుండా గుండె సంబంధ వ్యాధుల్ని, అతిసారం, మలేరియా, అనేక రకాలైన జ్వరాలు, లెప్రసీ, మొదలైన చాలా రకాల వ్యాధులకు వైద్యం చేశారు. భార్య ఫ్రా స్విట్జర్ ఇతనికి మత్తుమందు సహాయకులుగా ఉండేవారు. కోళ్ళ ఫారమ్ లో ప్రారంభించిన సేవ, అనతికాలంలోనే ఇనుముతో నిర్మించిన రెండు గదుల మొదటి వైద్యశాలకు తరలించారు. స్విట్జర్లు సొంత బంగళాలో నివసించేవారు. వీరు జోసెఫ్ అనే ఫ్రెంచి మాట్లాడగలిగే వాన్ని సహాయకుడిగా చేర్చుకున్నారు. లాంబరీని గుర్తించబడింది. మొదటి ప్రపంచ యుద్ధం చెలరేగిన తర్వాత 1914లో స్విట్జర్లు ఇద్దర్నీ లాంబరీనిలోనే నిర్బంధించారు. 1917లో విశ్రాంతి లేని పనిమూలంగా రక్తహీనతతో బాధపడ్డాడు. జూలై 1918లో స్విట్జర్లాండ్ లోని స్వస్థలానికి వెళ్ళిన తరువాత స్వతంత్రుడయ్యాడు. జర్మనీలో జన్మించిన ఇతడు ఫ్రెంచి పౌరసత్వం స్వీకరించాడు. స్ట్రాస్ బర్గ్ లో మతబోధకుడిగా పనిచేస్తున్నప్పుడు ఆరోగ్యం మెరుగైన తరువాత 1920 నుండి తిరిగి లాంబరీని వెళ్ళడానికి కావలసిన ధనాన్ని సమకూర్చడానికి మరల సంగీత కార్యక్రమాలు కొనసాగించాడు. 1922 లో ఆక్స్ ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ఇచ్చిన డేల్ స్మారక ఉపన్యాసాలు చాలా పేరుపొందాయి. వీనిలో రెండు సంపుటాలుగా ముద్రించబడ్డాయి. 1924 సంవత్సరంలో ఒంటరిగా తిరిగి గాబన్ చేరాడు. కొందరు వైద్యుల సహాయంతో వైద్యసేవలు కొనసాగించాడు. వారిలో డా.విక్టర్ నెస్మాన్ ముఖ్యుడు. ఆతని తరువాత డా.ట్రెంజ్ వీనితో చేరాడు. ముందుకాలంలో పనిచేసిన జోసెఫ్ తిరిగి కలిసాడు. 1925-6 లో కొత్త హాస్పిటల్ నిర్మించాడు, తెల్లవారి కోసం ప్రత్యేకంగా ఒక వార్డుతో సహా. కరువు, అతిసారం ప్రబలడంతో అక్కడి పనివారితోనే హాస్పిటల్ నిర్మాణం కొనసాగించాడు. డా.ట్రెంజ్ సహాయంతో ప్రయోగాలు చేయడం కూడా మొదలుపెట్టారు. హాస్పిటల్ నడుస్తుండగా 1927లో స్విట్జర్ ఐరోపా తిరిగి వచ్చాడు. స్విట్జర్ మళ్ళీ 1929-1932 మధ్యకాలంలో గాబన్ వెళ్ళి సేవచేశాడు. ఈతని పేరుప్రఖ్యాతులు ఐరోపా అంతా వ్యాపించాయి. మళ్ళీ 1937 లో వచ్చి రెండవ ప్రపంచ యుద్ధం ముగిసేవరకు అక్కడే ఉన్నాడు.



# కన్నీరుపాలయిన పౌరజనం


(నిన్నటి తరువాయి)



సరేనన్నట్టుగా సేవకులు అటుగా తీసుకుని వెళ్ళారు. తీసుకుని వెళ్ళి, పానుపుపై విశ్రమింపజేశారతన్ని. పడుకున్నాడన్న మాటేగాని, మహారాజుకి నిద్ర రావడం లేదు. కళ్ళు తెరిచినా మూసినా ఒకటే దృశ్యం! రథంమీద వెళ్ళిపోతూ రాముడే కనిపిస్తున్నాడతనికి. రాముడు అలా నిష్క్రమించడాన్ని తట్టుకోలేక పోతున్నాడు దశరథుడు. పిలుస్తున్నట్టుగా చేతులు జాచి 'రామా రామా' అంటూ విలపించసాగాడు. "నాయనా రామా! నన్ను వదలిపెట్టి వెళ్ళిపోయావా? నిన్ను మళ్ళీ చూడగలనో లేనో! నాయనా, నువ్వు క్షేమంగా తిరిగి వస్తావు చూడూ, అప్పుడు నిన్ను కౌగిలించుకున్నవారే గొప్పవాళ్ళురా! నేనంత వరకూ జీవించి ఉంటానో, ఉండనో." అని కుమిలిపోసాగాడు. కౌసల్యను కేకేసి పిలిచి ఇలా పలవించసాగాడు. "దేవీ! నా కళ్ళముందు రాముడు రథం ఎక్కి వెళ్ళిపోతున్న దృశ్యమే ఇంకా ఉంది. అదిగో రథం...రాముడడుగో...సీతాలక్ష్మణ సమేతంగా వెళ్ళిపోతున్నాడు రాముడు. ధూళిని రేపుకుంటూ రథం పరుగుదీస్తోంది. అంటే.. అంటే నేనెక్కడ ఉన్నాను దేవీ? రాచమార్గంలో ఉన్నానా? లేక నీ మందిరంలో ఉన్నానా? నీ మందిరంలో ఉంటే, నీ దగ్గరగా ఉంటే, ఏదీ దాన్ని నిజం చేస్తున్నట్టుగా నన్నొకసారి తాకు."తాకిందతన్ని కౌసల్య. బోరుమంది. భార్యాభర్తలిద్దరూ ఒక్కపెట్టుగా విలపించసాగారు. అప్పుడు అక్కడకి చేరుకుంది సుమిత్ర. కౌసల్యను ఓదారుస్తున్నట్టుగా దగ్గరగా తీసుకుందామెను. "అక్కా! సత్యసంధుడూ, జితేంద్రియుడూ, అప రాజితుడూ రామచంద్రుని గురించా ఈ దీనాలాపనలు? తండ్రి మాట నిలబెట్టడం కోసం అతను అడవులకు వెళ్ళాడు. అంతేగాని అవమానాలను భరించలేక వెళ్ళలేదు. తిరిగి వస్తాడమ్మా! వచ్చి ఈ జగతిని పాలిస్తాడు, చూస్తూ ఉండు." అన్నది సుమిత్ర. ఓదార్చసాగింది. "సూర్యకిరణాలు రాముణ్ణి బాధించవు. సమశీతోష్ణంగా వీచి వాయువు కూడా హాయిని కలిగిస్తాడు. తండ్రిలా చంద్రుడు ఆహ్లాదాన్ని కలిగిస్తాడు. దివ్యాయుధాలతో సంచరించే రాముడికి అడవిలో ఎదురుండదు తల్లీ, ఊరుకో.""సాక్షాత్తు లక్ష్మివంటి సీత నీడలా ఉండి సేవిస్తోంటే రాముడికి కొరతేమిటమ్మా? సేవా పరాయణుడు లక్ష్మణుడు శరచాప ఖడ్గాలతో కాపలా కాస్తోంటే రాముడికి వచ్చి పడే ఆపదలు ఏముం టాయి? ఊరుకో అమ్మా ఊరుకో.""అగ్నికి అగ్నిలాంటివాడు. సూర్యుడుకి సూర్యుడి లాంటివాడు. సిరికి మూలమైనవాడు, వీరాధివీరుడు రాముడికి ఈ భూమండలంలో లోపం ఏమిటి తల్లీ? ఒట్టుపెట్టి చెబుతున్నాను, నా మాటలు నమ్ము. వనవాసాన్ని పూర్తిచేసి సీతాలక్ష్మణులసహా రాముడు అయోధ్యకు తిరిగి వస్తాడు. వచ్చి తీరుతాడు. అప్పుడు నీ కళ్ళల్లో నేను ఆనందబాష్పాలు చూస్తాను. ఇది నిజం.""ధర్మపరాయణుడు రాముడికి మీరు తల్లిదండ్రులు. మీరిలా శోకించడం అతనికి అశుభం. ఊరుకోండిద్దరూ" అన్నది సుమిత్ర. కౌసల్యసహా దశరథునికి సపర్యలు చేయసాగింది. శాంతించాడతను. రథం శరవేగంతో దూసుకుపోతోంది. అయినా వెన్నంటి వస్తున్నారు పౌరులు. ఆలుబిడ్డల్నీ, ఆస్తి పాస్తుల్నీ వదులుకుని తనని వెనక్కి మరల్చేందుకు ప్రయత్నిస్తున్న పౌరులను చూసి కళ్ళు చెమర్చుకున్నాడు రాముడు. అతన్ని చూసి సీత కూడా కళ్ళు చెమ్మగిల్లజేసుకున్నది. "సుమంత్రా! రథాన్ని మెల్లగా పోనీ." చెప్పాడు రాముడు. కళ్ళాలను వదులుచేశాడు సుమంత్రుడు. పరుగులాపి, గుర్రాలు నడకలు సాగించాయి. పౌరులు రథాన్ని సమీపించారు. దగ్గరగా వచ్చిన పౌరులకి నమస్కరించి ఇలా అన్నాడు రాముడు. 'మీకెందుకీ కష్టనష్టాలు? నా మాట విని, వెనక్కి వెళ్ళిపోండి. నన్ను అభిమానించినట్టుగానే నా తమ్ముడు భరతుణ్ణి కూడా అభిమానించండి. వయసులో భరతుడు చిన్నవాడైనా మంచివాడు. రాజలక్షణాలు తెలిసిన వాడు. అందుకే తండ్రి అతన్ని యువరాజును చేయ సంకల్పించాడు. ఒక్కటి గుర్తు పెట్టుకోండి, నేనూ, నా తమ్ముళ్ళ లాగే మీరూ రాజాజ్ఞను పాటించక తప్పదు."తలలు వంచి వింటున్నారే తప్పా, తలలెత్తి సమాధానం చెప్పలేదెవరూ. "ఇంకొక విజ్ఞప్తి కూడా చేస్తున్నాను, నేను అడవుల్లో కష్టాలు పడుతున్నాననే బాధను మా తండ్రిగారు మరచిపోయే విధంగా మీరు ఆయన్ని అలరించాలి. దయచేసి వెళ్ళిపోండి." అన్నాడు రాముడు. దానికీ సమాధానం లేదు. "మౌనం వీడండి, మాట్లాడండి." అర్థించాడు రాముడు. అప్పుడు అంతా ముక్తకంఠంతో అన్నారిలా. "రామచంద్రా! నువ్వు అయోధ్యకు తిరిగి రా! నువ్వే మా రాజువి." "అవునవును, నువ్వే మా రాజువి." మరిన్ని గొంతులు వినవచ్చాయి. వెనక్కి తిరిగి చూశాడు రాముడు. ముసలితనంతో నడవలేక నడవలేక నడచి వస్తున్నారు బ్రాహ్మణులు. "గొప్పగుర్రాల్లారా! చెవులుగల జంతువుల్లో మీకంటే శ్రేష్ఠులు లేరు. రాముణ్ణి అడవుల పాలు చేసేందుకు ఎందుకంత తొందర? ఆగండి! మా మొర విని, నిలిచిపోండి, మీకు నమస్కరిస్తున్నాం, మమ్మల్ని అర్థం చేసుకోండి." అంటూ బ్రాహ్మణులు చేతులు జోడించి గుర్రాలకు నమస్కరించడాన్ని రాముడు చూశాడు. పడుతూ లేస్తూ పడుతూ లేస్తూ వస్తున్న వృద్ధులు వారు. కరిగిపోయాడు.

(మిగతా రేపటి సంచికలో)

# దుర్జనులలో త్రిగుణాల ప్రకోపం!



దుర్జనులు సహజంగానే 'శక్తి' సంపన్నులుగా ఉంటారు. కనుక, వారి పెత్తనం కొంతకాలం నిరాటంకంగా కొనసాగుతుంది. కానీ, ఎప్పటికైనా దానికి పతనం తప్పదు. వారి ప్రతి అడుగులోను 'అహం' కనిపిస్తుంటుంది. ఇందుకు కారణం, వారిలో 'త్రిగుణాలు' ప్రకోపించడమే. ఆ మూడు గుణాలు ఏమిటంటే: అసూయ, ఆత్మ ప్రత్యయం, ఆధిపత్య ప్రదర్శన. ఇదే వారిలోని అసలైన అజ్ఞానం.

ఇత్థ మారాధ్య మానోపి క్లిశ్నాతి భువన త్రయమ్ శామ్యేత్ ప్రత్యపకారేణ నోపకారేణ దుర్జనః?

-కుమార సంభవం

తారకాసురుని సంహారం సందర్భంలోని ఈ శ్లోకంలో కాళిదాసు మహాకవి అన్ని కాలాలకు పనికి వచ్చే ఒక గొప్ప సత్యాన్ని చెప్పాడు. 'ఓ బ్రహ్మదేవా! నీ వరం వల్ల తారకాసురుడు శక్తిగలవాడై ఎదురులేని ప్రాభవంతో ప్రకృతి మొత్తాన్ని శాసిస్తూ, సకల సౌఖ్యాలతో ఆనందాన్ని అనుభవిస్తూనే, రాక్షస స్వభావంతో దుర్జనుడై ముల్లోకాలను బాధలపాలు చేస్తున్నాడు. తారకుడు స్వభావంతోనే దుర్జనుడు. దుర్జనులు మంచిమాటలకు లొంగరు. వారికి తగిన విధంగా శిక్షను విధిస్తేనే వారు లొంగుతారు' అన్నది దీని భావం. శత్రువులపట్ల ప్రవర్తించవలసిన పద్ధతులు నాలుగు రకాలని రాజనీతి చెబుతున్నది. అవి: సామ, దాన, భేద దండోపాయాలు. శాంతి వచనాలతో కూడింది సామం. 'మహాభారతం'లో ధర్మరాజు మొదట 'తమ రాజ్యం తమకు తిరిగి ఇమ్మని' సామ వచనాలతోనే రాయబారం పంపించడం దీనికి ఉదాహరణ. దుర్జనుడైన దుర్యోధనుడు దానికి అంగీకరించడు. అప్పుడు పాండవులు రాజ్యంలో కొంత భాగం వదులుకోవడానికి అంగీకరిస్తూ, మిగిలిన 'కొంతయినా తిరిగి ఇమ్మని' అనడం దాన మార్గోపాయం. దుర్యోధనుడు దానికీ ఒప్పుకోలేదు. అప్పుడు భేదోపాయం ప్రయోగించారు. శ్రీకృష్ణుడు స్వయంగా రాయబారానికి వెళ్లి 'సామ దాన' మార్గాలలో రాజ్యాన్ని పాండవులకు ఇమ్మని కోరుతూనే, చాతుర్యంతో 'భేదోపాయాన్నీ' కొనసాగించాడు. ఫలితంగా కౌరవపక్షంలో పరస్పర విరుద్ధ భావజాల వ్యాప్తి జరిగింది. దుర్యోధనుని దుష్టబుద్ధి అందరికీ తెలియవచ్చింది. భీష్ముడు, ద్రోణుడు తదితరులు ధర్మం తప్పనివారు. కౌరవ పక్షాన్నే నిలిచి యుద్ధం చేసినా, వారి మనసులు మాత్రం 'పాండవులే జయించవలెననే' కృతనిశ్చయంతో ఉండటం దుర్యోధనుని పరాజయానికి తగిన మార్గాన్ని ఏర్పరిచింది. 'భీష్ముడు రంగంలో వున్నంత వరకు తాను యుద్ధం చేయనని' కర్ణుడు యుద్ధవిముఖుడు కావడం, శల్యుడు రథ సారథ్యం వహిస్తూనే కర్ణుని ఉత్సాహాన్ని తగ్గించే విధంగా మాట్లాడటం'.. వంటివన్నీ భేదోపాయంలోని తంత్రాలే. పద్దెనిమిది అక్షౌహినుల సైన్యం, భీష్మద్రోణకృపాశ్వత్థామలు, కర్ణశల్యాది మహావీరులు, స్వయంగా తాను కృషి చేసి సంపాదించుకొన్న గదాయుద్ధ నైపుణ్యం.. వంటివేవీ మహాభారత యుద్ధంలో దుర్యోధనునికి విజయం కలిగించలేదు. సపరివారంగా అతనికి సర్వనాశనం తప్పలేదు. ఇదంతా ధృతరాష్ట్రునికి తెలియదా? అంటే, తెలుసు. కానీ, దుష్టునికి శిక్ష పడితే తప్ప, పరిస్థితి సరైన మార్గంలోకి రాదు. కనుక, దుర్యోధనుని చావుతో కాని కథ సుఖాంతం కాలేదు. ఇలాంటివారే హిరణ్యకశిపుడు, నరకాసురుడు, జరాసంధుడు, కంసుడు మొదలైన వారందరూ అసుర సంపదతో విర్రవీగిన దుర్జనులు. అందరికీ చివరికి పట్టిన గతి మాత్రం పతనమే. పౌరాణికంగా, చారిత్రకంగా కూడా ఏ కథలో చూసినా చివరకు సన్మార్గానిదే విజయం. దీనికి కారణం, దుష్టులైనవారిలో వుండే అహంకారం. 'అహంకారం' అంటే, అసలైన అర్థం 'అహం కర్తృత్వ' భావన. 'సదరు పనిని చేస్తున్నది నేనే. మరెవరికీ దీనిలో కర్తృత్వం లేదు' అన్న అభిప్రాయం వారిది. తత్తం విచారిస్తే బోధపడే విషయం ఏమిటంటే, 'కేవలం మన శక్తి మాత్రంతోనే కార్యం నెరవేరుతుందనుకోవడంలో ఔచిత్యం లేదని' గుర్తించగలగాలి. చాణక్యనీతి ప్రకారం దుర్జనులు మంచిమాటలకు లొంగరు. వారిని 'వారి మార్గం'లోనే కౌటిల్యాన్ని ప్రదర్శించి అణచివేయక తప్పదు.

# కందిపప్పులా కనిపించే 'మసూర్ దాల్'తో ఎన్నో లాభాలు



ఆరోగ్యాన్ని ప్రసాదించే మసూర్ దాల్ గురించి చాలామందికి తెలియదు. ఇది కలర్ మార్చుకొని కందిపప్పులా కనిపిస్తుంది. కిచెన్‌లో ఉన్న అన్ని ధాన్యాల కన్నా మసూర్ దాల్ ప్రత్యేకం. ఈ పప్పు పోషకాల పుట్ట అని చెప్పవచ్చు. ఒక కప్పు మసూర్ దాల్‌లో 230 కేలరీలు, 15 గ్రా. డైటరీ ఫైబర్, 17 గ్రా. ప్రోటీన్లు ఉన్నాయి. భారతీయ వంటకాలలో మసూర్ దాల్ ముఖ్యమైన భాగంగా ఏర్పడింది. అయితే ఈ పప్పుకు ఓ స్పెషాలిటీ ఉంది. దీనిని ఎక్కువసేపు నానబెట్టనవసరం లేదు. అలాగే చాలా తొందరగా ఉడుకుతుంది. నాన్‌వెజ్ తిననివారికి మసూర్ దాల్ మేలు చేస్తుంది. ఇందులో ఇనుము, మాంసకృత్తులు పుష్కలంగా ఉన్నాయి. అందుకే దీనిని శాఖాహార ఆహారంలో క్రమం తప్పకుండా చేర్చుకోవాలంటున్నారు ఆరోగ్య నిపుణులు. మసూర్ దాల్‌లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది రక్తం ద్వారా చిన్నపేగులలోని ఆహారాన్ని గ్రహించే రేటును నిరోధిస్తుంది. అందువల్ల పప్పు జీర్ణక్రియ రేటును సమర్థవంతంగా తగ్గిస్తుంది. అంతేకాదు రక్తంలోని చక్కెర స్థాయిలను ఆకస్మాత్తుగా పెరగకుండా చూసుకుంటుంది. ఇందులో ఫైబర్ అధికంగా ఉండడం వల్ల శరీరంలోని కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. అంతేకాదు శరీరం నుంచి అదనపు కొలెస్ట్రాల్‌ను వదిలించుకోవడానికి కూడా సహాయపడుతుంది. ఇలా చేయడం వల్ల రక్త ప్రవాహం కూడా మెరుగుపడి గుండెకు సంబంధించిన ప్రమాదాలను తగ్గిస్తుంది. పప్పులో కొవ్వు పదార్థం తక్కువగా ఉంటుంది. దీనిఅధిక ఫైబర్ కంటెంట్ జీర్ణక్రియ ప్రక్రియను నెమ్మదిగా చేస్తుంది. దీనివల్ల ఆహారం తక్కువ తింటారు. దాంతో బరువు కూడా తగ్గడానికి సులువుగా ఉంటుంది. శరీరానికి కావాల్సిన విటమిన్లు, ప్రోటీన్లు, ఇతర పోషకాల కోసం ఒక కప్పు మసూర్ పప్పు సరిపోతుంది. మసూర్ పప్పు యాంటీఆక్సిడెంట్ల శక్తి కేంద్రం. ఇది కణాల నష్టాన్ని సమర్థవంతంగా తగ్గిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. మసూర్ పప్పు వృద్ధాప్య చాయలను తగ్గించి యవ్వనంగా కనిపించేలా చేస్తుంది. దీనిని కర్రీ రూపంలోనే కాకుండా దాని వినియోగానికి అదనంగా, మసూర్ పప్పును నేరుగా చర్మానికి కూడా అప్లై చేసుకోవచ్చు. మసూర్ పప్పు విటమిన్లు, క్యాల్షియం, మెగ్నీషియం వంటి ఇతర పోషకాల అడ్డా. ఈ పప్పు తినడం వల్ల ఆరోగ్యకరమైన దంతాలు ఆరోగ్యంగా ఉంటాయి. ఎముకలు దృఢంగా తయారవుతాయి. ఇలా ఉండాలంటే రోజువారీ ఆహారంలో చేర్చుకోవాలి. మసూర్ పప్పు విటమిన్ ఎ, సి మరియు ఇ గొప్ప వనరు. కంటి చూపు, దృష్టిని కాపాడటానికి ఈ విటమిన్లు చాలా అవసరం. ప్రతిరోజూ ఒక కప్పు మసూర్ దాల్ తినడం వల్ల కంటి లోపాలు, కంటిశుక్లం, కండరాల క్షీణత వంటి రుగ్మతల నుంచి మిమ్మల్ని కాపాడుతుంది. గ్రౌండ్ మసూర్ పప్పు, పసుపు, రోజ్ వాటర్ ఈ మూడింటినీ కలిపి పేస్ట్‌లా తయారు చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసుకోవాలి. దీనివల్ల చర్మాన్ని తెలికపరుస్తుంది. స్కిన్ మీద ఉన్న ట్యాన్‌ను తొలిగించవచ్చు. ఈ మిశ్రమంలో కొంచెం పాలు పోసి రాసుకుంటే చర్మం పొడిబారకుండా ఉంటుంది. ఈ ఫేస్‌మాస్క్‌ను రాత్రిపూట ట్రై చేయాలి. మసూర్ దాల్ ఆరోగ్యానికి మంచిది కదా అని మితిమీరి తినకూడదు. ఒక లిమిట్‌లో తినాలి. లేదంటే.. మూత్రపిండాల వ్యాధులు విటమిన్ల లోపం వంటి ప్రతికూల ప్రభావాలకు దారితీయవచ్చు. ఇది కొంతమందిలో అలెర్జీ ప్రతిచర్యకు కూడా కారణం కావచ్చు.

**ఆ.వెలి .**
**లలితపరిమళము**
**గులాబిజంట సొగసు**
**చూడ ముచ్చ టౌను**
**చూచుచుండ.,**
**పూలయందు మిన్న, పూబోడి**
**కన్నను,**
**తెలిసి**
**మెలగుమయ్యు!**
**తెలుగువాడ!**



- మల్లాది సోమేశ్వర శర్మ, 9603995769

# మెరిసే చర్మం కోసం...

ఈ సీజన్‌లో జిడ్డుగా మారి, నిర్జీవంగా కనిపించే చర్మాన్ని వంటింట్లో లభించే పదార్థాలతో కాంతిమంతంగా మార్చుకోవచ్చు. అదెలాగంటే...

**బంగాళదుంపలు:** ఒక గిన్నెలో టీ స్పూన్ యోగర్ట్, చిటికెడు ఉప్పు, కొన్ని చుక్కల నిమ్మగడ్డి నూనె లేదా సాండల్‌వుడ్ నూనె తీసుకొని బాగా కలపాలి. ఇప్పుడు బంగాళ దుంప ముక్కలను ఈ మిశ్రమంలో ముంచుతూ, వాటితో ముఖం అంతటా రాసుకోవాలి. పదిహేను నిమిషాల తరువాత నీళ్లతో కడుక్కోవాలి. దీంతో నల్లమచ్చలు తగ్గి, చర్మం మెరుస్తుంది.

**బియ్యప్పిండి:** దుకు బియ్యప్పిండిని స్క్రబ్బర్‌గా ఉపయో.గించవచ్చు. టీ స్పూన్ చొప్పున అలోవెరా జెల్, బియ్యప్పిండి, కొద్దిగా ఉప్పు, రెండు చుక్కల లావెండర్ నూనె తీసుకొని ఫేస్‌ప్యాక్ తయారుచేసుకోవాలి. ఇప్పుడీ ప్యాక్‌ను ముఖానికి మర్దనా చేసినట్టు రాసుకోవాలి. ఆరిన తరువాత నీళ్లతో శుభ్రం చేసుకొని తేలికైన మాయిశ్చరైజర్ రాసుకోవాలి.

# భారత్‌లో కరోనా కల్లోలం రికార్డుస్థాయి కేసులు



**దిల్లీ:** భారత్‌లో కరోనా వైరస్ విజృంభణ రోజురోజుకీ పెరుగుతోంది. నిత్యం రికార్డు స్థాయిలో నమోదవుతున్న పాజిటివ్ కేసులు.. గత 24గంటల్లోనే అత్యధికంగా 11.70లక్షల శాంపిల్స్‌ను పరీక్షించగా 83,883 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. భారత్‌లో ఒకేరోజులో 80వేలకు పైగా కేసులు నమోదవడం ఇదే ప్రథమం. అంతేకాకుండా ప్రపంచంలో ఏ దేశంలోనూ ఒక్కరోజు వ్యవధిలో ఇన్ని కేసులు నమోదుకాలేదు. దీంతో గురువారం నాటికి దేశంలో కరోనా కేసుల సంఖ్య 38లక్షల 53వేలకు చేరింది. వీరిలో ఇప్పటికే 29.70లక్షల మందికి పైగా కోలుకోగా.. మరో 8లక్షలకు పైగా బాధితులు చికిత్సపొందుతున్నారు. నిన్న మరో 68వేల మంది బాధితులు వైరస్ నుంచి కోలుకున్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. ప్రస్తుతం దేశంలో కరోనా బాధితుల రికవరీ రేటు 77.1శాతానికి చేరింది. కొవిడ్ మరణాల సంఖ్య పెరుగుతూనే ఉంది. నిన్న ఒక్కరోజే దేశవ్యాప్తంగా మరో 1043 మంది కరోనా రోగులు ప్రాణాలు కోల్పోయారు. దీంతో దేశంలో కొవిడ్ మృతుల సంఖ్య 67,376కు చేరింది. ప్రస్తుతం భారత్‌లో కరోనా మరణాల రేటు 1.7శాతంగా కొనసాగుతోంది.

## మేం పారిపోం.. ఏ అంశంపైనైనా చర్చకు రెడీ! కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషీ




**దిల్లీ:** ఈ నెల 14 నుంచి జరగబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఈసారి ప్రశ్నోత్తరాల సమయాన్ని రద్దుచేయడం పట్ల పలు రాజకీయ పార్టీల నుంచి వస్తున్న విమర్శలపై కేంద్రం స్పందించింది. బీఏసీలో నిర్ణయించిన ఏ అంశంపైనా చర్చకు సిద్ధమని, చర్చ నుంచి తామేమీ పారిపోవాలనుకోవడం లేదని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ తెలిపారు. నోటిఫికేషన్ విడుదల చేయడానికి ముందే అన్ని ప్రతిపక్ష పార్టీలతో సంప్రదించామన్నారు. చాలా పార్టీలు ఇందుకు అంగీకారం తెలిపినట్టు చెప్పారు. ఏ సమయంలోన్కైనా అడగగలిగే అన్‌స్టార్డ్ ప్రశ్నలకు కేంద్రం సిద్ధమేనన్నారు. శూన్యగంట సమయం 30 నిమిషాల పాటు ఉండేలా చూడాలని రాజ్యసభ ఛైర్మన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కోరినట్లు చెప్పారు. దీనిపై తుది నిర్ణయం వాళ్లు తీసుకుంటారని చెప్పారు. ఈ అంశంపై కేంద్రమంత్రులు అర్జున్ రాం మేఘ్వాల్, వి.మురళీధరన్, తాను ప్రతి రాజకీయ పార్టీతో మాట్లాడామన్నారు. ప్రశ్నోత్తరాల సమయాన్ని రద్దుచేయడాన్ని తృణమూల్ కాంగ్రెస్ నేత డెరెక్ ఓబ్రెయిన్ మినహా అందరూ అంగీకరించినట్టు చెప్పారు. మరోవైపు ప్రశ్నోత్తరాల సమయాన్ని రద్దుచేయడాన్ని కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్‌తో పాటు సీపీఐ విమర్శించాయి. కరోనా మహమ్మారి పేరిట ప్రజాస్వామ్యాన్ని హత్య చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించాయి.

## మరోసారి ఘోరంగా విఫలమైన పాక్



**న్యూయార్క్ :** ఐక్యరాజ్య సమితిలో పాకిస్తాన్‌కు మరోసారి చుక్కెదురైంది. భారతీయుల్ని తీవ్రవాదులుగా చిత్రీకరించే ప్రయత్నం ఘోరంగా విఫలమైంది. బుధవారం యూఎన్ 1267 కమిటీ ముందు వేణుమాధవ్ డోంగారా, అజయ్ మిస్త్రీ అనే ఇద్దరు భారతీయులను ఉగ్రవాదులుగా చిత్రీకరించేందుకు పాక్ ప్రయత్నించింది. అయితే పాక్ వాదనలకు సరైన ఆధారాలు చూపాలని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సభ్య దేశాలైన యూఎస్, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, బెల్జియంలు కోరాయి. ఈ నేపథ్యంలో పాక్ సరైన ఆధారాలు చూపలేకపోయింది. అంతటితో ఆగకుండా మరో ఇద్దరు భారతీయులు గోబింద పట్నాయక్, అంగార అప్పాజీలను కూడా ఉగ్రవాదులుగా చిత్రీకరించేందకు ప్రయత్నించింది. ఈ ప్రయత్నాన్ని కూడా భద్రతా మండలి సభ్యదేశాలు తిప్పికొట్టాయి. దీనిపై యూన్‌లోని భారత శాశ్వత ప్రతినిధి టీఎస్ తిరుమూర్తి ట్విటర్ వేదికగా స్పందించారు.. "ఉగ్రవాదానికి మతపరమైన రంగు పులమటం ద్వారా 1267 కమిటీ ప్రత్యేక చర్చల్ని రాజకీయం చేయడానికి పాకిస్తాన్ చేసిన ప్రయత్నాన్ని యూఎన్ భద్రతా మండలి అడ్డుకుంది. పాకిస్తాన్ చర్యల్ని తిప్పికొట్టిన భద్రతా మండలి సభ్య దేశాలకు ధన్యవాదాలు" అని పేర్కొన్నారు.


# పరివర్తనం వ్యాక్సిన్‌కు ప్రతిబంధకం కాబోదు

## కరోనా వైరస్ ఆ స్థాయిలో రూపాంతరం చెందడం లేదన్న అధ్యయనం



**వాషింగ్టన్:** కరోనా వైరస్ రోజురోజుకీ పరివర్తనం చెందుతూ కొత్త రూపాలు సంతరించుకుంటోందని పలు అధ్యయనాలు తెలిపిన విషయం తెలిసిందే. ఇది వ్యాక్సిన్ తయారీకి ప్రతిబంధకంగా మారొచ్చన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. కానీ, తాజాగా జరిపిన ఓ అధ్యయనం మాత్రం వ్యాక్సిన్‌పై ఆశలు పెంచింది. వైరస్ తొలుత గుర్తించిన నాటి నుంచి దాని జన్యుక్రమంలో తక్కువ స్థాయిలోనే మార్పు సంభవించినట్లు వెల్లడించింది. దీంతో మహమ్మారిని నయం చేసేందుకు ఒకే రకమైన వ్యాక్సిన్ సమర్థంగా పనిచేసే అవకాశం ఎక్కువగా ఉందని అభిప్రాయపడింది. ఈ మేరకు అమెరికాలోని వాల్టర్ రీడ్ ఆర్మీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చి సహా మరికొంత మంది శాస్త్రవేత్తలు జరిపిన అధ్యయనం ప్రముఖ పీఎన్ఏఎస్ జర్నల్‌లో ప్రచురితమైంది. మొత్తం 84 దేశాల నుంచి 18,514 మంది నుంచి సేకరించిన వైరస్ జన్యుక్రమాన్ని పరిశీలించి ఈ నిర్ణయానికి వచ్చారు. వైరస్ మనిషిలోకి ప్రవేశించిన తర్వాత వారి శరీరానికనుగుణంగా మార్పు చెందినట్లు ఆధారాలేమీ లేవని అధ్యయనం స్పష్టం చేసింది. ఇప్పటి వరకు జరిగిన మార్పులన్నీ ఒక క్రమ పద్ధతిలో కాకుండా యాదృచ్ఛికంగా జరిగినవేనని తెలిపింది. ఇక రూపాంతరం చెందిన కరోనా వైరస్ రకాల్లో ఒకటైన 'డీ614జీ'.. మనిషి శరీరానికి అనుగుణంగా మార్పు చెందుతున్నట్లు స్పష్టమైన ఆధారాలేమీ లేవని తాజా అధ్యయనం పేర్కొంది. అయితే, వైరస్ వెలుగులోకి వచ్చిన నాటి నుంచి ఈ రకం వేగంగా రూపాంతరం చెందడం నిజమేనని స్పష్టం చేసింది. అయితే ఆ మార్పునకు శరీరంలో సహకరిస్తున్న అంశాల్ని మాత్రం నిర్దుష్టంగా గుర్తించలేదని తెలిపింది. డీ614జీ ప్రభావాన్ని గుర్తించేందుకు మరింత లోతైన అధ్యయనం జరగాల్సి ఉందని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్న వ్యాక్సిన్లతో కరోనా వైరస్‌ను కట్టడి చేసే అవకాశం ఉందని అధ్యయనం పేర్కొంది. హెచ్ఐవీ, ఇన్‌ఫ్లూయెంజా, డెంగీ వంటి వ్యాధుల్లో వైరస్ రూపాంతరం వ్యాక్సిన్ అభివృద్ధికి ప్రతిబంధకంగా మారింది.

# కరోనాతో దిలీప్‌కుమార్ సోదరుడి మృతి



**ముంబయి:** బాలీవుడ్ నటుడు దిలీప్‌కుమార్ సోదరుడు ఇషాన్‌ఖాన్ కరోనాతో కన్నుమూశారు. గత కొంతకాలంగా ముంబయిలోని లీలావతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన.. బుధవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో తుదిశ్వాస విడిచారు. ఇషాన్‌ఖాన్ కరోనాతోపాటు గుండెజబ్బు, అల్జీమర్స్‌తో కూడా బాధపడుతున్నట్లు వైద్యులు వెల్లడించారు. మరో సోదరుడు అస్లామ్‌ఖాన్(90) కూడా అనారోగ్యం కారణంగా గత ఆగస్టు 21న మృతి చెందిన విషయం తెలిసిందే.

# నవంబర్ 1కల్లా అమెరికాలో వ్యాక్సిన్ పంపిణీ?



**వాషింగ్టన్:** ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్ అంతానికి బ్రహ్మాస్త్రమైన వ్యాక్సిన్ కోసం ప్రజలు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే ప్రపంచ దిగ్గజ ఔషధ సంస్థలు వ్యాక్సిన్‌ను సాధ్యమైనంత తర్వగా అందించేందుకు పోటీ పడి రేయింబవళ్లు శ్రమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అగ్రరాజ్యం అమెరికా వ్యాక్సిన్ పంపిణీలో కీలక ముందడుగు వేసినట్టు కనబడుతోంది. నవంబర్ 1నాటికి సమర్థవంతమైన కొవిడ్ టీకాను ప్రజలకు పంపిణీ చేసేందుకు సిద్ధంకావాలంటూ రాష్ట్రాలకు సమాచారం ఇచ్చినట్టు అమెరికా మీడియా సంస్థలు పేర్కొన్నాయి. వ్యాక్సిన్ పంపిణీ చేసేందుకు అవసరమైన వసతులపై దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ గత నెల 27న సీడీసీ డైరెక్టర్ రాబర్ట్ రెడ్‌ఫీల్డ్ రాసిన లేఖలో పేర్కొన్నట్టు వాల్‌స్ట్రీట్‌జర్నల్ పేర్కొంది. అమెరికా అధ్యక్ష ఎన్నికలకు రెండు రోజుల ముందే వ్యాక్సిన్ పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తోంది. మరోవైపు, ఆస్ట్రాజెనికా వ్యాక్సిన్ తుది ఆమోదానికి చేరువలో ఉందంటూ ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. అలాగే, వ్యాక్సిన్ అభివృద్ధి, దాని పంపిణీ విషయంలో పరస్పరం సహకరించుకొనేందుకు ఏర్పడిన ప్రపంచ దేశాల కూటమితో తాము కలిసి నడవబోమని కూడా అగ్రరాజ్యం చెప్పేసింది. దేశవ్యాప్తంగా 80 నగరాల్లో వివిధ ప్రయోగ కేంద్రాలు 30 వేల మంది వాలంటీర్లను నమోదుచేసుకున్నాయని ఆస్ట్రాజెనికా కూడా వెల్లడించింది. ఈ వాలంటీర్లంతా 18 ఏళ్ల పైబడినవారేనని, వివిధ సంస్కృతులు, జాతులు, భౌగోళిక ప్రాంతాలకు చెందిన వారు వీరిలో ఉన్నట్టు పేర్కొంది.

# పాకిస్తాన్ కుట్రలకు ఐరాసలో బ్రేక్!



**న్యూయార్క్:** ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో పాకిస్థాన్‌కు మరోసారి చుక్కెదురైంది. ఉగ్రవాద కార్యకలాపాలకు మతం రంగుపులుముతూ, రాజకీయం చేయాలనుకున్న పాకిస్థాన్ ప్రయత్నాలను ఐరాస భద్రతా మండలి తిప్పికొట్టింది. ఉగ్రవాద చర్యల పాల్పడుతున్నారంటూ ఇద్దరు భారతీయులను అంతర్జాతీయ ఉగ్రవాదుల జాబితాలో చేర్చాలని చేసిన ప్రయత్నం బెడిసికొట్టిందని ఐరాసలో భారత్‌కు శాశ్వత ప్రతినిధిగా ఉన్న తిరుమూర్తి వెల్లడించారు. భారతీయులను ఉగ్రవాదులుగా చిత్రీకరిస్తూ పాకిస్తాన్ ఐరాస తీవ్రవాద నిరోధక కమిటీ ముందు కొందరి పేర్లను ఉంచింది. ముఖ్యంగా విదేశాల్లో పలు అభివృద్ధి ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న వారిని అనుమానిస్తూ.. వారిని తీవ్రవాదుల జాబితాలో చేర్చాలని ప్రయత్నం చేసింది. అయితే, ఈ ఆరోపణలను భద్రతా మండలి ముందు రుజువు చేయలేకపోయింది. దీంతో సరైన ఆధారాలు ఇవ్వకపోవడంతోపాటు, అసత్య ఆరోపణలు చేసిన పాకిస్థాన్ చర్యను భద్రతా మండలిలో సభ్యదేశాలైన అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, బెల్జియం అడ్డుకున్నాయి. ఇటువంటి ప్రయత్నాలను పాక్ గతంలోనూ చేసింది. ఇద్దరు భారతీయులను తీవ్రవాద జాబితాలో చేర్చాలని గత సంవత్సరం చేసిన ప్రయత్నాలు భద్రతా మండలి ముందు విఫలమయ్యాయి. పాకిస్థాన్‌కు చెందిన మసూద్ అజర్‌ను అంతర్జాతీయ తీవ్రవాదిగా పేర్కొనడంలో భారత విజయం సాధించింది.

# మహిళ ఆత్మాహుతిని వీడియో తీసిన వ్యక్తి అరెస్ట్



**చెన్నై :** మహిళ ఆత్మాహుతిని అడ్డుకోకుండా వీడియో చిత్రీకరించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఆధారం కోసం ఆత్మాహుతిని తాను వీడియో చిత్రీకరించానని ఆ వ్యక్తి వాంగ్మూలం ఇచ్చాడు. దిండుగల్ జిల్లా కొడైకెనాల్ సమీపంలో మాలతి అనే మహిళ ఆత్మాహుతి చేసుకున్న విషయం తెలిసిందే. ఈ దృశ్యాన్ని ఓ వ్యక్తి వీడియో చిత్రీకరించాడు. ఆమె చేస్తున్న ప్రయత్నాన్ని అడ్డుకోకుండా, మానవత్వాన్ని మరిచి వీడియో చిత్రీకరించిన వ్యక్తి మీద సర్వత్రా ఆగ్రహం వ్యక్తమైంది. కనీసం ఆమెను రక్షించే ప్రయత్నం కూడా చేయకుండా అనేక మంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మానవత్వం మంట కలిసిందని చాలామంది ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన మీద కేసు నమోదు చేసిన కొడైకెనాల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మూడేళ్లు తనతో కాపురం చేసి, ఒక బిడ్డ పుట్టిన తర్వాత డ్రైవర్ సతీష్ మరో పెళ్లి చేసుకోవడంతోనే మాలతి ఆత్మాహుతి చేసుకున్నట్టు తేలింది. సతీష్‌ను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. ఆత్మాహుతి దృశ్యాలను వీడియో చిత్రీకరించిన వ్యక్తి సతీష్ సోదరుడు శరవణ కుమార్‌గా తేలింది. అతడ్ని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# వాటి వల్ల రఫేల్ యుద్ధవిమానాలకు నష్టం

## సత్వర చర్యలు కోరుతూ ఉన్నతాధికారుల లేఖ



**అంబాలా:** భారతీయ వైమానిక దళాన్ని మరింత బలోపేతం చేస్తూ.. ఐదు రఫేల్ యుద్ధవిమానాలు జులై 29న పంజాబ్‌లోని అంబాలా వైమానిక స్థావరానికి చేరాయి. ఈ లోహ విహంగాలు సెప్టెంబర్ 10న భారతీయ వాయుసేనలో అధికారికంగా భాగమౌతాయి. అయితే అత్యంత శక్తిమంతమైన ఈ విమానాలకు.. సాధారణ పక్షులు సమస్యగా మారాయి. వైమానిక స్థావరం చుట్టుపక్కల పేరుకున్న చెత్తా చెదారం పక్షులకు నెలవైంది. ఈ పక్షులు రఫేల్ యుద్ధవిమానాలకు తీవ్రమైన నష్టాన్ని కలుగచేయగలవని అధికారులు అంటున్నారు. ఈ విషయాన్ని వివరిస్తూ భారతీయ వాయుసేన డైరక్టర్ జనరల్ (ఇన్‌స్పెక్షన్ అండ్ సేఫ్టీ)ఎయిర్ మార్షల్ మానవేంద్ర సింగ్, హరియాణా చీఫ్ సెక్రటరీ కేశ్నీ ఆనంద్ అరోరాకు ఓ లేఖ రాశారు. "అంబాలాలో ఉన్న రఫేల్ విమానాల భద్రత, రక్షణ భారత వైమానిక దళానిది ప్రధాన బాధ్యత. అయితే ఈ పరిసరాల్లో అధిక సంఖ్యలో పక్షులు సంచరిస్తున్నాయి. ఇవి విమానాలను ఢీకొంటే నష్టం సంభవించే అవకాశం ఉంది. ఈ ప్రదేశంలో పక్షుల సంచారాన్ని నియంత్రించేందుకు అనేక సూచనలు, విజ్ఞప్తులు చేశాం. వీటి బెడదను నివారించేందుకు సరైన వ్యర్థ నిర్వహణ విధానం అనుసరించాలి. ఇక్కడ చెత్త పారబోసే వారికి జరిమానా విధించడం తదితర చర్యలు చేపట్టాలి. అంతేకాకుండా, ఎయిర్‌ఫీల్డ్‌కు దూరంగా వ్యర్థ నిర్వహణ ప్లాంటులను ఏర్పాటు చేయాలి" అని తన లేఖలో పేర్కొన్నారు. అంబాలా వైమానిక స్థావరం చుట్టుపక్కల 10 కి.మీ ప్రాంతంలో ఉన్న వ్యర్థాలను తొలగించే విషయమై ఇప్పటికే మూడు సార్లు సమావేశమై మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో సంప్రదింపులు జరిపామని ఆయన తెలిపారు.

# హ్యాపీ బర్త్ డే.. యూ ర్యాట్



**మిన్స్క్:** 'యూ ర్యాట్' అని తిడితే ముద్దుగానో, అల్లారు ముద్దుగానో తిట్టినట్లుగా ఉండొచ్చు. విద్యావంతుల తిట్టు ఇది. పైకి సాఫ్ట్ గా ఉన్నా, అర్థం విపరీతమైనది. అందుకే కుక్క అన్నా, నక్క అన్నా రాని కోపం.. బయటి దేశాల వారికి ఎలుక అంటే వస్తుంది. 'ర్యాట్' అంటే.. దూరంగా పెట్టవలసిన (హేట్‌ఫుల్) మనిషి అని. ఇంతవరకు నయం. అబద్ధాలకోరు అని, ద్రోహి అని, దొంగ అని, డబుల్ క్రాసర్ (మోసగాడు) అని.. ఇన్ని మీనింగులున్నాయి పాపం ఎలుక పేరు మీద! అశుభ్రంగా ఉండి, వ్యాధుల్ని వ్యాపింపజేస్తుందని కావచ్చు. ఏమైనా.. 'నీదసలు మానవ జన్మేనా' అని తిట్టినప్పుడు కూడా రాని కోపం, 'నువ్వో ఎలుక' అంటే వచ్చేస్తుంది పాశ్చాత్యులకు! మొన్న ఆదివారం బేలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ ల్యుకాషేంకో బర్త్ డే. 66 లో కి వచ్చారు. అయితే ఆయన తన పుట్టినరోజును జరుపుకునే విధంగా ఏమీ అక్కడి పరిస్థితులు లేవు.

# జమ్మూకశ్మీర్‌లో ఇక 5 అధికారిక భాషలు..!

## సివిల్ సర్వీసుల్లో 'మిషన్ కర్మయోగి'కి శ్రీకారం

## కేంద్ర కేబినెట్ ఆమోదం



**దిల్లీ:** జమ్మూకశ్మీర్‌లో ఐదు అధికారిక భాషలకు ఆమోదం తెలుపుతూ కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఇక అక్కడ ఉర్దూ, కశ్మీరీ, డోగ్రీ, హిందీ, ఆంగ్లం భాషలు అధికారిక భాషలుగా ఉండనున్నాయి. స్థానిక ప్రజల కోరిక మేరకు ఈ ఐదు భాషలకు అధికారంగా గుర్తింపు ఇస్తున్నట్లు కేంద్రమంత్రి ప్రకాశ్ జావదేకర్ వెల్లడించారు. ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలని ఈరోజు జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయించారు. నేడు జరిగిన భేటీలో వీటితోపాటు మరిన్ని కీలక అంశాలకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ముఖ్యంగా సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల నైపుణ్యాలను మెరుగుపరచడం కోసం 'మిషన్ కర్మయోగి' జాతీయ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సివిల్ సర్వీసులను మరింత శక్తిమంతంగా, పారదర్శకంగా తీర్చిదిద్దడమే ఈ మిషన్ లక్ష్యమని కేబినెట్ పేర్కొంది. వీటితోపాటు మరో మూడు అవగాహన ఒప్పందాలకు ఆమోదం తెలిపింది. జపాన్ టెక్స్‌టైల్, ఫిన్లాండ్ మైనింగ్ మంత్రిత్వశాఖలతో పాటు డెన్మార్క్ పునరుత్పాదక ఇందన మంత్రిత్వశాఖతో అవగాహన ఒప్పందాలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

# నగల వ్యాపారిని హత్య చేసిన దుండగులు



**పనాజీ:** గోవాలోని మార్గావ్ ప్రాంతంలో సప్నా ప్లాజా సమీపంలో స్వాప్నిల్ వాల్కే అనే 41 ఏళ్ల జ్యూవెలరీ షాపు యజమానిని దుండగులు హత్య చేశారు. కత్తులతో పొడవడంతో వ్యాపారి మృతి చెందాడు. దక్షిణ గోవా పోలీసు సూపరింటెండెంట్ మాట్లాడుతూ, 'సప్నా ప్లాజా సమీపంలోని మార్గావ్ ఏరియాలో ఒక ఆభరణాల వ్యాపారిపై దాడి చేసినట్లు పోలీస్ స్టేషన్‌కు కాల్ వచ్చింది. వెంటనే పోలీస్ ఇన్స్పెక్టర్ మార్గవో టౌన్ సిబ్బందితో పాటు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే ఆయన తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆయనను హొస్పిసియో ఆసుపత్రికి తరలించారు. అక్కడ బాధితుడు చనిపోయినట్లు ప్రకటించారు అని ఆయన తెలిపారు. సంఘటన స్థలంలో ఒక నాటు తుపాకీ, 3 లైవ్‌రౌండ్లు, ఒక కత్తి కవర్ స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. ఈ సంఘటన తరువాత ముగ్గురు వ్యక్తులు వీధి చివరకు పరుగెత్తుకొని వెళ్లడాన్ని అక్కడ ఉన్న చుట్టు పక్కన వారు వీడియో తీశారు. ఈ కేసుకు సంబంధించి విచారణ చేస్తున్నామని, నిందుతులను గుర్తించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని పోలీసులు చెప్పారు. దుకాణం లోపల, బయట ఉన్న సీసీటీవీ ఫుటేజ్లను స్వాధీనం చేసుకుని వాటిని పరిశీలిస్తున్నారు.

# జస్టిఫికేషన్ ఉండే పాత్ర నాది: సుధీర్ బాబు



'వి' చిత్రంలో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా జస్టిఫికేషన్ ఉన్న పాత్ర చేయడం చాలా హ్యాపీగా అనిపించింది: సుధీర్‌బాబు హీరోగా, నిర్మాతగా తనదైన గుర్తింపు సంపాదించుకున్నారు సుధీర్ బాబు. 'సమ్మోహనం' తర్వాత ఇంద్రగంటి దర్శకత్వంలో సుధీర్ బాబు నటించిన చిత్రం 'వి'. నేచురల్ స్టార్ నాని కూడా ఇందులో నటించారు. సెప్టెంబర్ 5న ఈ చిత్రం అమెజాన్ ప్రైమ్ ద్వారా విడుదలవుతుంది. ఈ సందర్భంగా వెబినార్‌లో పాత్రికేయులతో మాట్లాడుతూ ...

'వి' సినిమాను ముందుగా థియేటర్స్‌లో విడుదల చేయాలనే అనుకున్నాం. కానీ.. ప్రస్తుత పరిస్థితుల్లో థియేటర్స్‌లో సినిమాను విడుదల చేసే పరిస్థితి లేదు. అందుకనే ఓటీటీలోనే విడుదల చేస్తున్నాం. ఓటీటీలో సినిమాను విడుదల చేయడం కూడా ప్లస్ అయ్యింది. ఎందుకంటే ఇప్పుడు 'వి' సినిమాను 200 దేశాల్లో విడుదల చేస్తున్నాం.. దీని వల్ల తొలి రోజునే ఎక్కువ మంది చూసే అవకాశం ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఓటీటీనే బెస్ట్ ఆప్షన్. లాక్‌డౌన్ సమయంలో రెండు రోజులకొక కథ చొప్పున వింటూ వచ్చాను. అందులో రెండు కథలను కూడా ఓకే చేశాను. ఆ వివరాలను సదరు నిర్మాణ సంస్థలు ప్రకటిస్తేనే బావుంటుంది.

'వి' సినిమాలో నా పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుంది. చాలా మందికి ఇన్‌స్పిరేషన్‌గా నిలిచే పాత్ర. ఇంద్రగంటిగారు కథ చెప్పగానే నాకు కూడా ఈ పోలీస్ ఆఫీసర్ పాత్ర బాగా నచ్చింది. చాలా మందికి ఇన్‌స్పిరేషన్‌గా ఉండే సదరు ఆఫీసర్‌ను ఓ కిల్లర్ ఛాలెంజ్ చేస్తాడు. అప్పుడు ఆ పోలీస్ ఆఫీసర్ ఏం చేస్తాడనేదే సినిమా. జస్టిఫికేషన్ ఉండే పాత్రలో కనిపిస్తాను. సినిమాలో యాక్షన్, డ్రామాకు మంచి స్పేస్ కుదిరాయి. యాక్షన్ విషయానికి వస్తే .. సాధారణంగా బాడీని ఫిట్‌గానే ఉంచుకుంటాను. రెఫరెన్స్‌గా ఇంద్రగంటిగారు బ్రాడ్‌పిట్ యాక్ట్ చేసిన ఫైట్ క్లబ్ తరహాలో నా బాడీ ఫ్లెక్సిబుల్‌గా ఉండాలని కూడా చెప్పారు. దాంతో నేను బాడీని మరింత ఫ్లెక్సిబుల్‌గా చేసుకున్నాను. నా ఇంట్రడక్షన్ ఫైట్‌తోనే సినిమా స్టార్ట్ అవుతుంది. ఫైట్ మాస్టర్ రవివర్మగారు ఆ ఫైట్‌ను స్పెషల్‌గా డిజైన్ చేశారు.

ట్రైలర్ చూసిన తర్వాత మహేశ్‌కు అందులో యాక్షన్ పార్ట్ బాగా నచ్చింది. ఆ విషయాన్ని నాకు చెప్పారు. తనకు ఇంద్రగంటిగారంటే చాలా మంచి ఓపినియన్ ఉంది. 'సమ్మోహనం' టైంలో ఆ విషయాన్ని నాకు చెప్పారు. 'వి' సినిమా కోసం తను ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు కూడా చెప్పారు మహేశ్. హీరోయిన్ నివేదా ఇందులో అపూర్వ పాత్రలో కనిపిస్తుంది. తను క్రైమ్ నవలా రచయిత. మా మధ్య మంచి కెమిస్ట్రీ కుదిరింది. ఓ రకంగా చెప్పాలంటే ఇందులో హీరో, హీరోయిన్ మధ్య కెమిస్ట్రీ కంటే హీరో, విలన్ మధ్య కెమిస్ట్రీ బావుంటుంది. అలాగే అదితిరావు హైదరి కూడా చక్కటి పెర్ఫామెన్స్ చేసింది. తన పాత్ర ఏంటో తెలుసుకోవాలంటే సినిమా చూడాల్సిందే. ఇంద్రగంటిగారు సినిమాల్లో మంచి సంభాషణలుంటాయి. ఈ సినిమా విషయానికి వస్తే మంచి సంభాషణలతో పాటు మంచి యాక్షన్ పార్ట్ కూడా ఉంటుంది.

నేను, నాని కంఫర్ట్ యాక్టర్స్, ఇద్దరం కొలతలు వేసుకుని నటించలేదు. ఆర్టిస్ట్‌గా నమ్మకం ఉండటంతో నానితో కలిసి ఈ సినిమా చేయడానికి యాక్సెప్ట్ చేశాను. ఇద్దరం పోటీ పడటం అనడం కంటే మా క్యారెక్టర్స్ ఇందులో పోటీపడతాయని చెబితే చక్కగా ఉంటుంది. ఇంద్రగంటిగారు .. సెట్స్‌లో మంచి ఎన్విరాన్మెంట్ క్రియేట్ చేస్తారు. ఆయన సెట్‌లో ఆర్టిస్టులు రిలాక్స్‌డ్‌గా ఉంటారు. కానీ డైరెక్టర్‌గా టెన్షన్ అంతా ఆయనే తీసుకుంటారు. సినిమా ముందు యూనిట్‌ను ఇంద్రగంటి గారు చాలా ప్రిపేర్ చేస్తారు.. కాబట్టి సెట్స్ కు వచ్చేటప్పటికీ చాలా కాన్ఫిడెంట్ గా వస్తారు. విలనిజం ఒక్కొక్క స్టైల్లో ఉంటుంది. ఉదాహరణకు నేను బాఘిలో చేసిన విలనిజం ఈ సినిమాతో పోల్చితే చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. సినిమాలో నాని నెగటివ్ షేడ్స్‌లో తన యాక్టింగ్‌తో ఓ డిఫరెంట్ లుక్ తీసుకొచ్చాడు. పుల్లెల గోపీచంద్‌గారి బయోపిక్ కొన్ని కారణాలతో వెనక్కి వెళుతుంది.. డిసెంబర్ లో స్టార్ట్ అవుతుందని భావిస్తున్నాను. ఇది నేను చేయబోయే ప్యాన్ ఇండియా మూవీ. మంచి కాన్సెప్ట్ కోసం బాగా వెయిట్ చేస్తాను. నేనే అని కాదు.. ఎవరైనా మంచి కాన్సెప్టులను సెలక్ట్ చేసుకోవాలి. అందుకే నేను చూజీగా ఉన్నట్లు అనిపిస్తుంది. వెబ్ సిరీస్‌లను కూడా చేయడానికి అభ్యంతరం లేదు. మంచి ప్రొడక్షన్ హౌసెస్, బడ్జెట్ కుదిరితే చేయడానికి ఏమాత్రం ఆలోచించను. అలాగే నా ప్రొడక్షన్‌లోనూ వెబ్ సిరీస్‌లను చేయడానికి ప్లాన్ చేస్తున్నాను. నిర్మాతగా కూడా జాయింట్ వెంచర్స్ చేయడానికి ప్లాన్ చేసుకుంటున్నాను.



## తెరపై రొమాన్స్ కష్టమనుకున్నా

టాలీవుడ్ అందాల తార సమంత యాక్టింగ్ స్కిల్స్ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. గ్లామర్ రోల్ అయినా, సీరియస్ పాత్రలోనైనా సులభంగా ఒదిగిపోగల నటి. గౌతమ్ మీనన్ డైరెక్షన్ లో తెరకెక్కిన ఏ మాయ చేశావే చిత్రంతో అందరి మనసులు దోచేసింది సామ్. ఈ బ్యూటీ తాజాగా సోషల్ మీడియాలో ఆస్క్ మీ సెషన్ లో పాల్గొంది. ఓ నెటిజన్ ప్రశ్నకు సమాధానమిస్తూ తెరపై రొమాన్స్ పండించటం చాలా కష్టమని డైరెక్టర్ గౌతమ్ మీనన్ ను కలిసే వరకు అనుకున్నా. అంతేకాదు డైరెక్టర్ నందినీరెడ్డిని వరకు కామెడీ పండించటం కూడా కష్టమనుకున్నా. ప్రస్తుతం ఎలాంటి పాత్ర చేయాలన్నా నాకు భయమనేది లేదని సమంత చెప్పుకొచ్చింది.



## 'ఆదిపురుష్'లో సీతగా

యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ – బాలీవుడ్ డైరెక్టర్ ఓం రౌత్ కాంబినేషన్ లో "ఆదిపురుష్" అనే సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. 3–డీలో రూపొందనున్న ఈ చిత్రాన్ని భూషణ్ కుమార్ – కృష్ణ కుమార్ – ప్రసాద్ సుతార్ – రాజేష్ నాయర్ – ఓం రౌత్ లు కలిసి భారీ బడ్జెట్ తో నిర్మించనున్నారు. 'చెడుపై మంచి సాధించిన విజయం' అనే థీమ్ తో రానున్న ఈ మూవీ టైటిల్ మోషన్ పోస్టర్ ఇటీవల విడుదల చేశారు. ఈ పోస్టర్ ని చూసిన సినీ అభిమానులకు ప్రభాస్ రాముడిగా కనిపించబోతున్నాడని అర్థం అయింది. అయితే అప్పటి నుంచి 'రావణాసురుడు' 'సీత' పాత్రలు ఎవరు పోషిస్తారనే దానిపై సోషల్ మీడియాలో పెద్ద డిస్కషన్ జరుగుతోంది. ఈ నేపథ్యంలో 'ఆది పురుష్'లో ప్రభాస్ ని ఢీకొట్టే ప్రతినాయకుడు 'లంకేష్' గా బాలీవుడ్ హీరో సైఫ్ అలీఖాన్ నటించనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.కాగా ఇప్పుడు 'సీత' పాత్రలో ఎవరు కనిపిస్తారనే దానిపై ఆసక్తి మొదలైంది. ఈ క్రమంలో 'మహానటి' కీర్తి సురేష్.. 'భరత్ అనే నేను' ఫేమ్ కియారా అద్వానీ పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే కియారా అద్వానీని ఉత్తమురాలైన సీత పాత్రలో అంగీకరిస్తారా అని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎందుకంటే కియారా ఇంతకముందు 'లస్ట్ స్టోరీస్' అనే వెబ్ సిరీస్ లో బోల్డ్ గా నటించడంతో పాటు వైబ్రేటర్ సీన్ లో కూడా నటించి అందరిని షాక్ కి గురి చేసింది. అంతేకాకుండా 'గిల్టీ' ఒరిజినల్ మూవీలో డ్రగ్స్ తీసుకుంటూ సిగరెట్స్ మందు తాగే అమ్మాయిగా కనిపించింది. అలాంటి పాత్రల్లో నటించిన కియారా ని ఇప్పుడు 'సీత' పాత్రలో యాక్సెప్ట్ చేస్తారా అని సోషల్ మీడియా వేదికగా చర్చించుకుంటున్నారు. అయితే మరికొందరు మాత్రం నటీనటులు ఎలాంటి పాత్రల్లో అయినా నటిస్తారని.. అది వారి వృత్తి ధర్మం అని.. అప్పుడు బోల్డ్ గా నటించినట్లే ఇప్పుడు సాంప్రదాయ బద్ధమైన పాత్రలో నటిస్తే తప్పేంటని కామెంట్ చేస్తున్నారు. మరి పాన్ ఇండియా మూవీగా రానున్న 'ఆదిపురుష్' లో మేకర్స్ హీరోయిన్ గా ఎవరికి ఓటేస్తారో చూడాలి.

## మెగా ఫోన్ పట్టిన 'దంగల్' బ్యూటీ

హీరోయిన్స్ మెగా ఫోన్ పట్టుకోవడం చాలా చాలా అరుదుగా చూస్తూ ఉంటాం. ఒక్కరు ఇద్దరు సీనియర్ హీరోయిన్స్ గతంలో దర్శకత్వం వహించడం మనం చూశాం. కాని ప్రస్తుతం ఉన్న హీరోయిన్స్ లో ఎవరు కూడా దర్శకత్వంపై ఆసక్తి చూపిస్తున్న దాఖలాలు అయితే కనిపించడం లేదు. కాని దంగల్ సినిమాతో నటిగా నిరూపించుకుని ఆ తర్వాత వరుసగా హాట్ హాట్ పాత్రలను చేస్తూ స్టార్ హీరోయిన్స్ కు గట్టి పోటీ ఇచ్చే అందాల ప్రదర్శణ చేస్తున్న ఫాతిమా సనా షేక్ దర్శకురాలిగా మారింది.ఈమె దర్శకత్వం వహిస్తున్నది సినిమాకు కాదు. ఒక మ్యూజిక్ వీడియోకు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో మన చుట్టు ఉన్న వారు ఎలా ఉన్నారు వారు ఏం చేస్తున్నారు అనే విషయాలతో ఒక పాటను చిత్రీకరించింది. విశాల్ భరద్వాజ్ ఈ పాటలో కనిపించబోతున్నాడు. షూటింగ్ పూర్తి చేసి ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ చేయిస్తోంది. పాల్కిన్ ఖోలో... అంటూ సాగే ఈ పాట జనాలను ఆలోచింపజేస్తుందని ఆమె ఆశిస్తుంది. పాట గురించి ఫాతిమా మాట్లాడుతూ.. విశాల్ నాకు పూర్తి స్వాతంత్ర్యం ఇచ్చారు. నేను ఎలా కోరుకున్నానో అలా నటించారు. ఈ పాటలో నా కుక్క బిజిలీ కూడా కనిపించబోతుంది. విశాల్ సర్ తో దానికి నటించే అవకాశం దక్కినందుకు సంతోషంగా ఉందని పేర్కొంది. అతి త్వరలోనే ఆ పాటను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేందుకు ఈమె రెడీ అవుతోంది.



## షూటింగ్ కి గ్రీన్ సిగ్నల్

కరోనా మహమ్మారి వలన ఈ ఏడాది ఊహించని విధంగా నెలకొన్న పరిస్థితుల మూలాన అన్ని రంగాలతో పాటు సినీ పరిశ్రమలో కూడా ఎలాంటి నష్టం వాటిల్లిందో మన అందరికీ తెలిసిందే. దీనితో ఎన్నో చిత్రాల షూటింగులు నిలిచిపోయాయి. ఇప్పుడిప్పుడే నెమ్మదిగా షూటింగులు కూడా మొదలవుతున్నాయి. అయితే ఇంతకు ముందు మాత్రం షూటింగులకు అనుమతులు వచ్చినా సరే చాలా మంది స్టార్ హీరోలు సైతం షూటింగ్ లో పాల్గొనేందుకు ఇష్టపడలేదు.కానీ ఇప్పుడు ఒక్కొక్కరిగా పరిస్థితులు అలా ఉన్నప్పటికీ చేసేందుకు రెడీ అవుతున్నారు. అయితే మొట్ట మొదటిగా ఈ పరిస్థితిలో ముందడుగు వేసిన స్టార్ హీరోయిన్ మాత్రం రకుల్ ప్రీత్ సింగ్ అనే చెప్పాలి. తాను లేటెస్ట్ గా మెగా హీరో వైష్ణవ్ తేజ్ తో చేస్తున్న ప్రాజెక్ట్ లో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మన టాలీవుడ్ విలక్షణ దర్శకుడు క్రిష్ జాగర్ల మూడి తెరకెక్కిస్తున్న ఈ చిత్రం వికారాబాద్ అడవుల్లో మొదలు కానుంది. ఇక అక్కడ నుంచి రకుల్ 40 రోజుల పాటు కొనసాగే ఈ సింగిల్ షెడ్యూల్ లో పాల్గొననుంది.





## రేర్ కిస్

బాలీవుడ్ బ్యూటీ పూజా బాత్రా లిప్‌లాక్ ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. రేర్ కిస్ అంటూ నడిరోడ్డుపై అందరూ చూస్తుండగానే ఆమె చేసిన ఈ కిస్ సీన్ చూసి షాక్ అవుతున్నారు నెటిజన్లు.సీనియర్, జూనియర్ అనే తేడా లేకుండా సోషల్ మీడియాలో ప్రతి ఒక్క సెలబ్రిటీ యాక్టివ్ అవుతున్నారు. ముఖ్యంగా బాలీవుడ్ హీరోహీరోయిన్స్ నిత్యం తమ తమ సోషల్ మీడియా హేండిల్స్‌ని ఆసక్తికర అప్‌డేట్స్‌తో ఫిల్ చేస్తూ ఫాలోయింగ్ పెంచుకుంటున్నారు. ఈ క్రమంలోనే తాజాగా బాలీవుడ్ బ్యూటీ పూజా బాత్రా ఓ రొమాంటిక్ పిక్ షేర్ చేసి అట్రాక్ట్ చేసింది. ఏకంగా ఓ జంతువుతో లిప్‌లాక్ చేసి ఆ పిక్ తన ఇన్స్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేసింది.ఆధునికత జోరులో కొత్తపుంతలు తొక్కుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ గత కొంతకాలంగా సామాజిక మాధ్యమాలను షేక్ చేసేలా పోస్టులు పెడుతోంది హీరోయిన్ పూజా బాత్రా. బాలీవుడ్‌లో పలువురు అగ్ర హీరోలతో రొమాన్స్ చేసి ప్రస్తుతం దాంపత్య జీవితాన్ని ఎంజాయ్ చేస్తున్న ఆమె.. లాక్‌డౌన్ వేళ ఇంట్లోనే రిలాక్స్ అవుతూ తన పాత జ్ఞాపకాన్ని, ఓ రొమాంటిక్ మూమెంట్‌ని షేర్ చేసింది. లామా అనే ఓ జంతువును నది రోడ్డుపైనే తాను ముద్దాడుతున్న దృశ్యాన్ని పంచుకొంటూ 'రేర్ కిస్' అనే ఇంట్రెస్టింగ్ ట్యాగ్ జత చేసింది పూజా.ఈ పిక్ గతంలో తాను కొలంబియా పర్యటన వెళ్ళినప్పటిదని పేర్కొన్న పూజా బాత్రా.. ఆ విహారయాత్ర తాలూకు జ్ఞాపకాలను నెమరు వేసుకుంది. తన ఫ్రెండ్ కృష్ణ తంగవేలు తన కొలంబియా యాత్రకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చూసుకున్నాడని, తామిద్దరం ఈ ట్రిప్ ఫుల్లుగా ఎంజాయ్ చేశామని ఆమె పేర్కొంది. ఇక ఆమె పోస్ట్ చేసిన రేర్ కిస్ ఫోటో చూసి నెటిజన్లు ఫన్నీ రియాక్షన్స్ ఇస్తూ ఆసక్తికర కామెంట్స్ చేస్తుండటం విశేషం

Printed, Published and Owned by B.V.Subrahmanyam, RK Printers, 49-23-27-1 Lalitha Nagar, Flot No: 101, Sai Tirumala Enclave, Visakhapatnam - 530016 Andhra Pradesh.
Editor B.V.Subrahmanyam, RK Printers, 49-23-27-1 Lalitha Nagar, Flot No: 101, Sai Tirumala Enclave, Visakhapatnam - 530016 Andhra Pradesh. Email : bulusu009@gmail.com, Cell : 8500159006